www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 30 | మార్చి | 2026
పేజీలు : 8

# ప్రాణం తీసిన ఈత సరదా





**-రెండు కుటుంబాల్లో విషాదం నింపింది..**
**-ఆదివారం సెలవు, ఆట విడుపు చిన్నారులను అనంత లోకాలకు చేర్చాయి**

2లో..

## మొక్కజొన్న, ధాన్యం
# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి




**-గ్రామీణ ప్రాంతాలలో విబి జి రాం జి ద్వారా ఉపాధి కల్పించాలి**
**-సాగర్ నీటిని ఏప్రిల్ 30 వరకు విడుదల చేయాలి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** గిట్టుబాటు ధర లేక మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరిచి మార్క్‌ఫెడ్ ద్వారా మద్ధతు ధర రూ.2,400 చొప్పున కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద నుంచి మొక్కజొన్నలను కారుచౌకగా కొనేందుకు ప్రయత్నిస్తున్నారని, రైతులు క్వింటాకు రూ. 800 నుంచి రూ. 1,000 మేర నష్టపోతున్నారని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా సమితి సమావేశం ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జాగర్లముడి రంజిత్ అధ్యక్షతన రెండవ రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై

మిగతా 2లో..

## పది విద్యార్థులకు
# కార్పొరేట్ గాలం..!

**- ముందస్తు అడ్మిషన్ల కోసం హడావుడి**
**- ఏజెంట్లుగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు**
**- మొదలైన దందా**
**- వసతుల పేరుతో అడ్డగోలు ప్రచారం**




**ప్రజాపక్షం/భద్రాచలం :** పదో తరగతి పరీక్షలు పూర్తి కాక ముందే కార్పొరేట్ విద్యా సంస్థల హడావిడి మొదలైంది. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు సగానికి పైగా హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాల్లోని కళాశాలల్లో చదివేందుకు వెళుతుంటారు. మిగతా వారంతా స్థానికంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదువుతుంటారు. పిల్లలకు మంచి భవిష్యత్ ఉండాలనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు అప్పుసప్పులు చేసి నగరాల్లో ఉండే కాలేజీల్లో చేర్పించి చదివిస్తుంటారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకున్న కార్పొరేట్ కాలేజీల వారు తమకు వచ్చిన ర్యాంకులను, తమ వద్ద అన్ని సౌకర్యాలు ఉన్నాయని మభ్యపెడుతూ అడ్మీషన్లు తీసుకుంటున్నారు. ఐఐటి, జేఇఇ, నీట్ లలో ర్యాంకులను సాధించాలంటే తమ కళాశాలల్లో చేరాలని ప్రచారం చేస్తూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. ఇంటర్ బోర్డు నియమ నిబంధనల ప్రకారం విద్యా సం. పూర్తి కాకుండానే అడ్మీషన్ల ప్రక్రియ చేపట్టరాదనే

మిగతా 2లో..

# రయ్ రయ్‌మంటున్న మైనర్లు..!

### నేలకొండపల్లి మండలంలో నిబంధనలు గాలికి..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రెండు చక్రాల వాహనంపై ముగ్గురు.. గాలిలో తేలుతున్నట్లు అతివేగం.. నోట్లో సిగరెట్టు.. చేతిలో సెల్ ఫోన్, ఇదీ నేలకొండపల్లి మండల కేంద్రంతో పాటు శివారు గ్రామాల్లో నిత్యం కనిపిస్తున్న భయంకరమైన దృశ్యం. 16 ఏళ్లు కూడా నిండని మైనర్లు బైకులతో రోడ్లపైకి వచ్చి ప్రాణాంతకమైన విన్యాసాలు చేస్తూ పాదచారులను, ఇతర వాహనదారులను వణికించేస్తున్నారు.

**నిబంధనలు గాలికి.. అతివేగమే ఊపిరిగా!..**
వేగం కన్నా ప్రాణం మిన్నా అనే హెచ్చరిక బోర్డులు రోడ్డు పక్కన వెక్కిరిస్తున్నా, యువత మాత్రం వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు ఎక్కి హై స్పీడ్‌తో వెళ్తున్నారు. హెల్మెట్ లేకపోవడం ఒకెత్తయితే, వాహనం

మిగతా 2లో..

# పేదోడి ఫ్రిజ్‌కి..యమ గిరాకీ..!

### ఎండలు పెరుగుతుండటంతో పెరిగిన అమ్మకాలు





**ప్రజాపక్షం/వైరా:** వేసవికాలం ప్రారంభం అయింది. ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే ప్రజలు ఎండలకు తట్టుకోలేని పరిస్థితి. వేడి తాపం నుంచి శరీరానికి చల్లదనాన్ని కల్పించేందుకు ప్రజలు వారి ఆర్థిక స్థోమతలకు అనుగుణంగా రకరకాల వస్తువులను సమకూర్చుకుంటున్నారు. ఆర్థిక స్తోమత కలిగిన వారు వేసవిలో ఫ్రిజ్‌లను కొనుగోలు చేస్తుండగా, ఆర్థిక స్తోమత లేని వారు మట్టి కుండలనే ఫ్రిజ్‌లుగా భావిస్తున్నారు. కొందరు ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి కంపడలకు ప్రాధాన్యమిస్తున్నారు.

మిగతా 2లో..

# మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. గతేడాది మొక్కజొన్న లాభసాటిగా ఉండడంతో ఖమ్మం జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారని ఆయన తెలిపారు. యాసంగి కోతలు కూడా ప్రారంభమయ్యాయని వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఎటువంటి కొర్రీలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని సురేష్ కోరారు. అనేక పంటలు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో వివిధ దశలలో ఉన్నందున ఏప్రిల్ 30 వరకు నీటిని విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వారబంధి పెట్టిన రైతులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఏప్రిల్ ఒకటి నుంచి 30 వరకు నిరంతరాయంగా నీటిని విడుదల చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక పేదలు పట్టణాలకు వలస పోతున్నారని విబి జి రాం జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వెంటనే పనులు చేపట్టాలన్నారు. పనికి సంబంధించి హాజరు విషయంలో పలు రకాల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా నిరంతరాయంగా ఉపాధి కల్పించి తక్షణం వారి ఖాతాల్లో నగదు జమ చేయాలని సురేష్ డిమాండ్ చేశారు. పార్టీ శత వసంతాల ముగింపు సభను విజయవంతం చేసినందుకు పార్టీ కార్యకర్తలకు, నాయకత్వానికి




కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థులు ఏకమై సిపిఐని దెబ్బతీయాలని ప్రయత్నం చేసినా ప్రజలు పార్టీకి అండగా నిలిచారని మరి కొన్ని స్థానాల్లో విజయం సాధించాల్సి ఉన్న వివిధ కారణాలతో ఓటమి చెందినట్లు సురేష్ తెలిపారు. పార్టీ నిర్మాణ కర్తవ్యాలపై దృష్టి సారించాలని గ్రామశాఖ నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు హేమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్రక్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన ఈత సరదా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈత సరదా ఇద్దరు చిన్నారులను బలి తీసుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఆటవిడుపు కోసం సరదాగా గేదెలు మేపేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ఈత కోసం నీటి గుంతలో దిగి తమ నిండు ప్రాణాలను పోగొట్టుకుని, వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కు చెందిన ఒంటెపూడి దేవా (12) స్థానిక ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. వేంసూరు మండలం కుంచపర్తి గ్రామానికి చెందిన వంగూరి నాగబాబు (12) తన అమ్మమ్మ ఎన్టీఆర్ నగర్లో ఉండగా వారి ఇంటి దగ్గర ఉంటున్నాడు. ఆదివారం కావడంతో ఇద్దరు కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ సమీపంలోని వేంసూరు రోడ్డులో గేదెలు మేపేందుకు వెళ్ళారు. వారు గేదేలు మేపే ప్రదేశంలో నీటి గుంటలు ఉండటంతో అక్కడే సరదాగా ఈతకు దిగారు. లోతు తెలియని చిన్నారులు ఒక్కసారిగా ఊబిలోకి వెళ్ళి ప్రాణాలు కోల్పోయారు. గమనించిన స్థానికులు సహాయ చర్యలు చేపట్టిన లోతు ఎక్కువగా ఉండటంతో వారి ప్రయత్నాలు ఫలించకపోవటంతో తక్షణమే పోలీస్, ఫైర్, 108 సిబ్బంది సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది గజ ఈత గాళ్లను రంగంలోకి దించి వెతికినా ఫలితం లేకపోయే సరికి జాలర్ల సహాయంతో వలల విసిరి నీటి గుంతలో పడి మృతి చెందిన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఒంటెపుడి దేవా (12) బాలుడి మృతదేహం లభించింది. వంగూరి నాగబాబు (12) ఆచూకి లభించకపోవటంతో విస్తృతంగా నీటి క్వారీలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి నాగబాబు మృతదేహం లభించటంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే కాలనీకి చెందిన ఇద్దరు బాలురు మృతి చెందడంతో ఎన్టీఆర్ నగర్ లో విషాదచాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి పుర చైర్మన్ రిహానా కమల్ పాషా, కాంగ్రెస్ నాయకుడు కమల్ పాషాలు చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# రయ్ రయ్‌మంటున్న మైనర్లు..!

(మొదటిపేజీ తరువాయి)

నడుపుతూనే భుజంపై ఫోన్ పెట్టి మాట్లాడటం పరిపాటిగా మారింది. దీనివల్ల వెనుక నుంచి వచ్చే హారన్ శబ్దాలు కూడా వినపడక ప్రమాదాలకు దారితీస్తోంది.

**మత్తులో మైనర్లు.. నిర్మానుష్య ప్రాంతాలే అడ్డాలు..**

కేవలం డ్రైవింగ్ మాత్రమే కాకుండా, మైనర్లు గ్రామ శివార్లలోని నిర్మానుష్య ప్రాంతాలకు చేరుకుని సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు. మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలనే కాకుండా, ఎదుటివారి ప్రాణాలను కూడా బలి తీసుకుంటున్నారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

**తల్లిదండ్రులారా జాగ్రత్త.. పిల్లల చేతికి బైక్ ఇస్తే జైలుకే..**

పిల్లల కోరికలను కాదనలేక లేదా హోదా కోసం మైనర్ల చేతికి బైక్ తాళాలు ఇస్తున్న తల్లిదండ్రులు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం: జరిమానా మరియు జైలు మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే యజమానికి లేదా తల్లిదండ్రులకు రూ.5,000 జరిమానాతో పాటు 3 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. సదరు మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే వరకు ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయదు. వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఏడాది పాటు రద్దు చేసే అధికారం అధికారులకు ఉంది.

**పోలీసుల నిఘా అవసరం...**

కేవలం జరిమానాలు విధిస్తే సరిపోదని, మండలంలోని ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు తప్పవు : ఎస్ఐ**



నేలకొండపల్లి ఎస్.ఐ పి. సంతోష్ మాట్లాడుతూ, మేము ఎన్ని తనిఖీలు చేసినా, జరిమానాలు విధించినా తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవడం విచారకరం. ఇకపై మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కచ్చితంగా క్రిమినల్ కేసులు పెడతాం. గత రెండు నెలల్లో మైనర్లు గాయపడిన, మరణించిన ఘటనలు చూస్తుంటే బాధేస్తోంది. మీ పిల్లల ప్రాణాలతో ఆటలాడకండి అని హెచ్చరించారు.

# ఆత్మగౌరవ నినాదానికి 44 వసంతాలు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల కేంద్రంలోని టీడీపీ సెంటర్, సమితి సింగారం పంచాయతీ ఆఫీస్ ఏరియా, తహశీల్దార్ ఆఫీస్ ఏరియా, పూల మార్కెట్ ఏరియాలో టిడిపి పార్టీ 44వ ఆవిర్భావం దినోత్సవ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ హడక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ దొర, వాసిరెడ్డి చలపతి రావు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బచ్చల భారతీ, పట్టణ అధ్యక్షులు ఎలమాటి పూర్ణచంద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంబాబు, పట్టణ కోశాధికారి ముసునూరి చందర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి బొల్ల ఆంజనేయులు, యార్లగడ్డ రాజా, చావా రామరావు, ము మ్మనేని సత్యనారాయణ, దండమూడి రాంబాబు, దర్పునేని హరి, చిర్ర రవికుమార్, తాత రామయ్య, మేదరమెట్ల నాగేశ్వరరావు, గుండా రామ చందర్ రావు, ఎగ్గడి మల్లయ్య, సుగిల్ల సూరి బాబు, బచ్చల సుమేష్, కడియాల సాగర్, ధారావత్ వీరన్న, అజ్మీరా బావూ సింగ్, రాజు, చందమల్ల అమర్, మహిళ నాయకురాలు చావా శ్రీదేవీ, పురిటి విజయలక్ష్మి , అలివేలు మరియు పట్టణ వ్యాపారస్తులు, అన్న అభిమానులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులకు కార్పొరేట్ గాలం..!

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలున్నప్పటికీ అవేమీ పట్టనట్లుగా కార్పొరేట్ సంస్థలు నిబంధనలను ప్రక్కకు నెట్టి తన కార్యకలాపాలు సాగిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు రంగు రంగుల కరపత్రాలను ముద్రించి పరీక్షా కేంద్రం నుండి బయటకు వచ్చిన విద్యార్థులను చుట్టు ముట్టి పంచుతున్నారు.

**టీచర్లే ఏజెంట్లు :** జిల్లాలో ఉన్న చాలా మంది విద్యార్థులు హైదరాబాద్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున అడ్మీషన్లు పొందేందుకు వెళుతుంటారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయా కళాశాలలకు చెందిన వారు తిష్ట వేసి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. విద్యార్థులు ఎవరు చెబితే మాట వింటారో వారినే ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ టీచర్లు, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు ఆయా ప్రైవేటు స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులను ఏజెంట్లుంగా పెట్టి వారి ద్వారా ఆడ్మీషన్లు రాబట్టుకుంటున్నారు. తమ కళాశాలలో చక్కటి సౌకర్యాలు ఉన్నాయని, మంచి ర్యాంకులు వస్తున్నాయంటూ మభ్య పెడుతూ అడ్మీషన్లు పెంచుకుంటున్నారు.

**ఫోన్లు, మెస్సేజీలు :** పలు కాలేజీలు నెల రోజుల ముందు నుండే అడ్మీషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను సేకరించి నిత్యం ఫోన్లు చేస్తున్నారు. మెస్సేజీలు పంపుతున్నారు. ముందస్తుగా అడ్మీషన్లు తీసుకుంటూ రాయితీలు అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుని వారిని నేరుగా కలిసి ఫీజులు భారీ రాయితీలు కల్పిస్తూ అడ్మీషన్లు పొందుతున్నారు. గత ఏడాది ఇంటర్, జేఇఇ మెయిన్స్, ఎంసెట్, ఐఐటి, నీట్ ర్యాంకులు చూపించి అడ్మీషన్లు పొందుతున్నారు. ఏసి, నాన్ ఏసి క్యాంపస్‌ల పేరిట తల్లిదండ్రులను మభ్య పెడుతూ లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. జిల్లాలో ఇంటర్ అడ్మీషన్ల దందా యదేశ్చగా సాగుతుండగా ఆ విద్యా శాఖ అధికారులు మాత్రం తెలియనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

# పేదోడి ఫ్రిజ్‌కి..యమ గిరాకీ..!

(మొదటిపేజీ తరువాయి)



దీంతో వేసవి కాలం ప్రారంభం కావడంతో మటికుండలకు డిమాండ్ ఎక్కువ పెరుగుతుంది. మట్టి కుండ నీటిని చల్లగా ఉంచుతాయి. అందుకే కుండను పేదల ఫ్రిజ్‌గా చల్లటి నీళ్లు ఇచ్చేవి గాక ఆరోగ్యపరంగా గొప్ప లాభాలు కలిగిస్తాయి అని ప్రజల నమ్మకం. ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకు కుండలకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మట్టి కుండలు మన నాగరికతకు దర్పణంగా భావిస్తున్నారు. మట్టి సహజంగా ఆక్సిజన్ రిలీజ్ చేస్తుంది. ప్లాస్టిక్ కంటే మట్టి కుండలు పర్యావరణానికి ఎంతోఉపయోగం అని చెప్పవచ్చు. కుండలోని చల్లని నీటితో వేసవి తాపానికి విరుగుడుగా ఉపయోగపడుతుంది. కుండల్లో నీరు ఆరోగ్యానికి మంచిదిగా మన ప్రజలు భావిస్తున్నారు. వేసవిలో మట్టి కుండలను కోరుకునే వారి సంఖ్య పెరుగుతుండటంతో వారి అభిరుచి కనుగుణంగా కొత్త డిజైన్లతో రకరకాల కుండలు తయారు చేస్తుండటంతో మార్కెట్‌లో కుండకు డిమాండ్ పెరుగుతుంది. కుండ నీళ్లలో ప్రయోజనాలు అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. నీళ్లలో ఖనిజాలు కలిసి చల్లగా ఉంచుతుంది. జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది. బిపి, షుగర్ నియంత్రణ అవుతుందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. కంపడలను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. రూ.100–150ల ధరతో కొంటున్నారు. పురాతన కాలం నుంచి కూడా మట్టి పాత్రలు వాడుతున్నారు. వ్యవసాయం మొదలైనప్పటి నుంచి కుండల వాడకం భారీగా పెరిగినట్లు చరిత్ర చెబుతుంది. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా కుండల వాడకం వేసవిలో పెరిగింది.

# మణుగూరు సింగరేణి ఓసి-2లో ఘోర ప్రమాదం

## -డంపర్ టైర్ పేలి ఒకరు మృతి, నలుగురికి గాయాలు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియాలోని సింగరేణి ఓసి2 గనిలో విషాదకర ప్రమాదం చోటుచేసుకుంది. విపిఆర్ కంపెనీకి చెందిన ఓబీ పనుల్లో భాగంగా నిలిపి ఉంచిన డంపర్ వాహనం టైర్ ఆకస్మికంగా పేలడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు కార్మికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఉదయం షిఫ్ట్‌లో టైర్ సమస్య తలెత్తడంతో డంపర్‌ను అక్కడే నిలిపివేశారు. అనంతరం బ్రేక్‌డౌన్ అయిన డంపర్‌ను రిపేర్ చేస్తుండగా అకస్మాత్తుగా టైర్ బ్లాస్ట్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మృతి చెందిన మరియు గాయపడిన కార్మికులు అందరూ బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# డబుల్‌బెడ్ రూమ్ నిర్మాణాలను చేపట్టాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** నవభారత్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలు ఆక్రమించుకొన్నారు. తహశీల్దార్ దారా ప్రసాద్, పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. చట్ట విరుద్ధంగా క్రమించుకొన్న ప్రభుత్వం నిర్మిస్తున్న ఇండ్లను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభు త్వం ఏండ్లు గడుస్తున్నా ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పేదలంటే పాలకులకు పట్టింపు లేదని మండిపడ్డారు. ఇకనైనా అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు దొడ్డా రవికుమార్ పాల్గొన్నారు.

# ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించే ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని రఘునాథపాలెం మండలంలో జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామశాఖ సమావేశం వార్డు సభ్యులు విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని రఘునాథపాలెం మండలంలో జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కూడా చేపట్టాలన్నారు. ఏప్రిల్ 10న రజబ్‌అలీ వర్ధంతిని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలన్నారు. చిమ్మపుడి గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయాలని సిపిఐ తరుపున కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వాలను పలువురు పునరుద్ధరణ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, ఉప సర్పంచ్, మండల సహాయ కార్యదర్శి జూలా వెంకటేశ్వర్లు, గ్రామశాఖ కార్యదర్శి గాదిపర్ల సత్యనారాయణ, ప్రొద్దుటూరి వెంకట రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసి పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, 44 సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, పట్టణ అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరావు, మండదపు మధుసూదన్‌రావు, మోత్కూరు వెంకటేశ్వరరావు, సూర్యదేవర వెంకటకృష్ణ, కట్టా నర్సింహారావు, చావా కాంతారావు, బండారు శ్రీనివాసరావు,గౌస్‌పాషా,గుడ్లనాగేశ్వరరావు పాల్గొన్నారు.

# చిన్న దూరమైన హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించండి



**-ప్రాణ రక్షణలో మన జాగ్రత్తకే కీలకపాత్ర**
**-వైరా ఏసిపి ఎస్.సారంగపాణి**





**ప్రజాపక్షం/వైరా:** ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా వైరా ఏసిపి కార్యాలయం నందు ఏసిపి ఎస్.సారంగ పాణి ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బందికి హెల్మెట్‌లను ఏసిపి సారంగపాణి అందజేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి ఏసిపి సారంగ పాణి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ వాహనదారులు ప్రాణ రక్షణ ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చిన్న ప్రయాణమైన ద్విచక్ర వాహనంపై, కారులో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలి అన్నారు. హెల్మెట్ ధరించండి మనకి మన కుటుంబానికి ఎంతో రక్షణను ఇస్తుంది, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ మన ప్రాణాలు పోకుండా కాపాడుతుంది. కారు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలి అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా సీట్ బెల్ట్ ధరించకపోవడం వలన జరుగుతున్నాయని, సీట్ బెల్ట్ వలన ప్రమాద సమయంలో ప్రాణాపాయం ఘనంగా తగ్గుతుందని అన్నారు. సీట్ బెల్ట్ వాడకపోతే ఎయిర్ బ్యాగ్స్ కొన్ని సందర్భాల్లో ఓపెన్ కావాలని ఆయన తెలిపారు. ప్రతి వాహనదారుడు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెంట్ పెట్టుకోవడం మరిచిపోవద్దని, మన విధిగా బాధ్యతగా భావించి ధరించాలని, ప్రాణం విలువ ఎంతో గొప్పది, అలాంటి ప్రాణం ప్రమాదంలో పోకుండా ఉండాలి అంటే రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఏసిపి సారంగపాణి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, వైరా అదనపు ఎస్సై పవన్, కొణిజర్ల ఎస్సై సూరజ్, తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**ప్రజాపక్షం/చింతకాని :** శ్రీరక్ష హాస్పిటల్ ఖమ్మం ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్య యాత్ర ఆదివారం చింతకాని మండలం జగన్నాధపురంలో నిర్వహించారు. తొలుత ఆరోగ్య బృందం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఉచిత వైద్య శిబి రాన్ని గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న ప్రారంభించారు. డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు యువత డ్రగ్స్, మద్యపానం , పొగాకు కు దూరంగా ఉండాలని ఇవి తీసుకోవడం వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ అలవాల శ్రీదేవి, పాలకవర్గ సభ్యులు తోటకూరి హరీష్, చిర్ర మల్లేశ్వరి,శ్రావణ్, నాయకులు తాళ్ళూరి రమేష్, బందెల నాగార్జున, తోటకూరి సైదేశ్వరరావు, నర్సింహారావు, తన్నీరు పుల్లయ్య, అరువూరి వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసు ప్రభువుపై ప్రేమను తెలిపేదే మట్టల వేడుక



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఏసు ప్రభువు శిలువ మరణం ముందు, ఎరుషలేములో ప్రవేశించినప్పుడు భక్తులు ఖర్జూర మట్టలకు పూలు అలంకరించి, ఆయనపై ప్రేమ ను వ్యక్తం చేశారని, ప్రభువుపై ప్రేమను తెలిపేది మట్టల వేడుకన్నారు పాస్టర్ యాకోబు. ఆదివారం పట్టణంలోని సిద్దారం రోడ్ లో గల బిలీవర్స్ చర్చ్ ప్రాంగణంలో పాస్టర్ నందికోల యాకోబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మట్టల వేడుక నిర్వహించారు. క్రైస్తవుల ఉపవాస దీక్షల కాలంలో భాగంగా మట్టల వేడుకలను నిర్వహించినట్లు యాకోబు తెలిపారు. వేడుక సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించారు. క్రైస్తవ భక్తులు ఉపవాసాలు జరిపి, పాటలతో ప్రార్థనలు జరిపించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, జ్యోతి, సురేష్, మురళి, సుజాత, నాగ కుమారి, మురళి, సునీత, సురేష్, చింటూ, కమల, స్వామి, శిరీష, రవీందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగువారి కోసం పుట్టిందే తేదేపా



**ప్రజాపక్షం/చింతకాని :** తెలుగువారి కోసమే దివంగత ఎన్టీఆర్ తేదేపాను ఏర్పాటు చేశారని ఆ పార్టీ చింతకాని మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు అన్నారు. తేదేపా ఆవిర్భావ దినోత్సవం చింతకాని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, గంట సత్యనారాయణ, మల్లెల వెంకటేశ్వర్లు, పెంట్యాల రామారావు, సుధాకర్, తాజుద్దీన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తేలుకుంట్ల మాట్లాడుతూ తెలంగాణలో రానున్న రోజుల్లో తేదేపా కూటమికి ప్రజలు అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు నన్నక రామారావు, మైనార్టీ సెల్ నాయకులు సోందు, షేక్ జానిమియా, నాయకులు పొను గోటి బాబు, కూచిపుడి సతీష్, బండి ప్రసాద్, తాళ్ళూరి శేషయ్య, రాము, గురజాల మాధవ కిషోర్, ఉమారావు, జక్కి వీరబాబు, పూనాటి ఫరీద్ , తాళ్లూరి వెంకటేశ్వర్లు, ముప్పాళ్ళ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శాసన సభ్యుల క్రీడా పోటీల్లో రాణించిన ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** హైదరాబాద్‌నగరంలో జరుగుతున్న శాసనసభ, శాసన మండలి సభ్యుల క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన 'లెమన్ అండ్ స్పూన్' పోటీలో మంత్రి కొండా సురేఖ ప్రథమ స్థానాన్ని సాధించగా, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి ద్వితీయ స్థానం, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తృతీయ స్థానం పొందారు. ప్రజా సేవలో నిత్యం నిమగ్నమై ఉండే ప్రజాప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

# ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీ హరి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం ద్వారా "సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై సత్తుపల్లి లోని జెవిఆర్ కాలేజ్ లో ఆదివారం వాకార్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. అదే విధంగా మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని కోయచలక గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆదివారం ఉపాధి హామీ నిధులు రూ. 13 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు సర్పంచ్ బలుసుపాటి శేషయ్య శంకుస్థాపన చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, నాయకులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, మేళ్లచెరువు రాంప్రసాద్, చెరుకూరి ముత్తయ్య, చెరుకూరి సీతారాములు, చెరుకూరి కృష్ణారావు, బలుసుపాటి వెంకటేశ్వర్లు, అమరం అప్పారావు, చెరుకూరి జయరాజు, అమరం పరమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలి



ప్రజాపక్షం/కూసుమంచి: రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని కూసుమంచి ఎస్ఐ నాగరాజు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసింహులగూడెం గ్రామంలో అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమం మూడవ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు హెల్మెట్ల వాడకం, ట్రాఫిక్ నియమాల గురించి సూచనలు ఇచ్చారు. వాహనదారులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు, కుటుంబాలపై పడే ప్రభావం, చట్టపరమైన చర్యలు, ప్రాణనష్టం వంటి అంశాలను నొక్కి చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపటం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారితీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించడం తప్పని సరని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ వాడకం, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్ నివారించాలన్నారు. ఎల్లప్పుడూ ఎడమ వైపున ఉంటూ, జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలని తెలిపారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండల కేంద్రంలో నందమూరి తారక రామారావు నిర్మించిన తెలుగుదేశం పార్టీ నలభై నాల్గవ ఆవిర్భావ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ చెన్నయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ అని, బడుగు బలహీన వర్గాల కోసం పార్టీ ఎంతగానో కృషి చేసిందని అన్నారు. ఈకార్యక్రమంలో చెల్లా వెంకటేశ్వరరావు, కేసరి రాములు, కేసరి రామరాజు, పాల్గొన్నారు.

## లాన్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియాలో క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా లాన్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేయాలని సిఐటియు కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం యాజమాన్యాన్ని కోరారు. ఆదివారం కార్యాలయంలో లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మణుగూరు ఏరియా నుండి లాన్ టెన్నిస్ లో కోల్ ఇండియా స్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించిన కార్మికులను అభినందిస్తూ మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దుటకు మణుగూరులోనే సౌకర్యాలు కల్పించాలని, గోల్డ్ మెడల్ సాధించిన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రతి రోజు పాల్వంచ వెళ్లి సాధన చేసి సింగరేణికి మణుగూరు ఏరియా కి మంచి పేరు తెచ్చారని కావున ఇప్పటికైనా యాజమాన్యం సరైన వసతులు ఏర్పాటు చేసి కార్మికులను ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలని కోరారు. ఈ సమావేశంలో విల్సన్ రాజు, సాయి కృష్ణ, ముజఫర్, సుమన్, రాంబాబు, సాంబశివరావు, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, బిక్షపతి, సతీష్, తిరుపతి,విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఎల్లమ్మతల్లి కల్యాణం



ప్రజాపక్షం/కరకగూడెం: మండల పరిధిలోని కరకగూడెం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మూడు రోజుల నుంచి ఎల్లమ్మ పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తిప్పని కృష్ణారావు లలిత, తిప్పని శ్రీనివాసరావు శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం మైలలు తీయగా సోమవారం పుట్ట బంగారం ఆలయం వద్దకు భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చారు. మంగళవారం ఎల్లమ్మ తల్లి జమదగ్ని కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కల్యాణ మహోత్సవం జనగం జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమాదురు గ్రామానికి చెందిన ఉగ్గ పూజారులు జిట్టె వీరస్వామి, తుప్పతి యాదయ్య, గుమళ్ళ అశోక్, ఆసర్ల ప్రశాంత్, కర్రె నందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్లమ్మ జమదగ్నిలను భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీని జయప్రదం చేయండి

**అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల పిలుపు**



ప్రజాపక్షం/మణుగూరు: ఏప్రియల్ 4న సాయంత్రం 5 గంటలకు మణుగూరు లో జరిగే యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని మణుగూరు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ప్రజలను కోరారు. ఆదివారం మణుగూరు లోని స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ, ప్రపంచ వనరుల మీద ఆధిపత్యం కోసం, ముఖ్యంగా ఆయిల్ నిక్షేపాల మీద ఆధిపత్యం కోసం ఆయిల్ నిల్వలు ఉన్న దేశాలపై ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, ఐక్యరాజ్య సమితి నిబంధనలను ధిక్కరిస్తూ, ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా దాడులు నిర్వహిస్తుందన్నారు. దానిలో భాగంగానే గతంలో ఇరాక్, వెనుజులా తదితర దేశాలపై దాడులు నిర్వహించిందన్నారు. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పై ఏకపక్షంగా యుద్ధం చేస్తూ ఆ దేశ అధ్యక్షుడిని కుటుంబంతో సహా చంపడమే కాకుండా ఆ దేశ ముఖ్య నాయకత్వాన్ని, పసిపిల్లలను చంపిందన్నారు. ఈ యుద్ధం వలన ఆయా దేశాల ప్రజలే కాకుండా ప్రపంచ ప్రజలు కూడా ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ఈ యుద్ధ ప్రభావం మన భారతదేశంపై కూడా పడుతుందన్నారు. ఇప్పటికే ఈ యుద్ధం పేరుతో గ్యాస్, డీజిల్, పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అన్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే గ్యాస్, డీజిల్, పెట్రోల్ కొరతతో అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు జీవించలేని దుర్భర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున ఈ యుద్ధాన్ని వ్యతిరేకించవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కావున ఏప్రియల్ 4 న సాయంత్రం మణుగూరు లో జరిగే యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సరెడ్డి పుల్లారెడ్డి, డి. సుధాకర్ (సిపిఐ), నెల్లూరు నాగేశ్వరరావు (సిపిఎం), ఏ. చంద్రారెడ్డి (న్యూడెమోక్రసీ), ఎం. మోహన్ రావు (ఎంసిపిఐ (యు)), ఆర్. మధుసూదన్ రెడ్డి, (సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా), ఎండి. రఫీ (ముస్లిం మిల్లత్ కమిటీ), గడ్డం వెంకటేశ్వర్లు (ఏఐటియుసి), ఎస్. సాంబశివరావు (సిఐటియు), ఎస్ డి. నాజర్ పాషా (ఐఎఫ్‌టియు), ఎం. రాజేందర్ (టియుసిఐ), పి. ఆదిలక్ష్మి (పిఓడబ్ల్యు) మాట్లాడారు. ఈ సమావేశంలో ఎండి. సర్వర్, ఎస్. వెంకట్రావు, బొల్లం రాజు, దుర్గం ప్రణయ్, మంగీలాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా...ఆరుగురు చిన్నారులకు గాయాలు

**-ఇద్దరికి తీవ్ర గాయాలు**





ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలం పేరేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని జమలాపల్లి వద్ద ఆదివారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురు బాలలకు గాయాలయ్యాయి. అందులో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. వివరాల ప్రకారం పేరేపల్లి గ్రామానికి చెందిన వజ్జ సునీల్ సరదాగా ఆరుగురు చిన్న పిల్లలను ఆటోలో ఎక్కించుకుని పేరేపల్లి నుండి ఇల్లందు వైపు వెళ్తుండగా మధ్యలో మరో బాలుడికి ఆటో నడిపేందుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ బాలుడు ఆటో నడుపుతుండగా ఒక్కసారి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పులసం యశ్వంత్, అలెం స్నేహితు, దనసరి భారత్, అలెం తేజ, అలెం చిట్టు, దనసరి ప్రవీణ్ గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో పులసం యశ్వంత్, అలెం స్నేహితు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న ప్రజాప్రతినిధి..!

**-అబ్బుగూడెం ఉపసర్పంచ్‌పై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు**
**ఉప సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామం లోని ఉప సర్పంచ్ కర్రి వెంకటేశ్వర్లు ఒక బాధ్యత గల ప్రజాప్రతినిధిగా ఉంటూ ఏజెన్సీ చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ గిరిజనుల హక్కులను తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అబ్బుగూడెం గ్రామంలో 60శాతం నాయకపోడు సామాజిక వర్గానికి చెందిన గిరిజన వాసులు ఉండటం జరుగుతుంది. వీరిలో ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులుగా ఉండటం వలన వీరి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని వీరిపై పెత్తనం చేలా ఇస్తున్నారు. వీరిని అడ్డుపెట్టుకొని ఏజెన్సీ ప్రాంతంలో భూమిలేని గిరిజన బిడ్డలకు ప్రభుత్వ ఫలాలను పథకాలను సాగు చేసుకోవడానికి భూమిని అందకుండా, వారిని ఆమడ దూరంలో ఉంచి ఈయన మాత్రం ప్రభుత్వ భూమికి పక్కన ఉన్న వేరే రైతుల యొక్క సర్వే నెంబర్లను వేసుకొని పట్టాలు చేయించుకొని ప్రభుత్వ పథకాలు అనుభవిస్తూ జల్సా చేస్తున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గిరిజనులు గిరిజన ఇతరులు సంబంధిత అధికారులకు వరుసగా ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. ఈ విధంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా, గ్రామం మొత్తం ఉద్రికత్త వాతావరణంలోకి జారుకుంది. ఏజెన్సీ చట్టాలను అమలు చేయాల్సిన ప్రజాప్రతినిధే వాటిని పక్కబెట్టి వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ అక్రమాలపై ప్రశ్నించిన గిరిజనులనే లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగాడని, కొందరిపై తిరుగుబాటు యత్నం చేసినట్లు ఆరోపణలు మరింత ఉద్రికత్త రేపుతున్నాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్తతలు చెలరేగే పరిస్థితి ఏర్పడింది. ఈవిషయంపై గ్రామంలో అఖిలపక్ష పార్టీల నాయకులు పెద్దలు గిరిజనుల వైపు ఉండగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడ్ని అడ్డం పెట్టుకొని ఉప సర్పంచ్ చెగ రేగిపోతున్నాడని, ఉప సర్పంచ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, యువత, మహిళలు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలిన గ్రామస్తులు కోరుతున్నారు. ఏజెన్సీ చట్టాల పరిరక్షణపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా చూపించాలని వారు కోరుకుంటున్నారు.

## దండిగా పూత..
# దయ లేని కాత..

- వాతావరణ మార్పులతో కుదేలైన మామిడి రైతు
- గతం కంటే అధికంగా పెట్టుబడి..
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



ప్రజాపక్షం/కరకగూడెం: మామిడి రైతును కష్టాలు వదలడం లేదు. ఏ ఏటికా ఏడు ఇకనైనా కాలం మారక పోతుందా, కలిసి రాకపోతుందా అనే ఆశతో ముందుకు సాగుతున్న రైతు ప్రతి సంవత్సరం నష్టాల ఊబిలో కూరుకుపోతూనే ఉన్నాడు. వాతావరణంలో వస్తున్న మార్పులు రైతును కుదేలు చేస్తున్నాయి. ఒకటి రెండు సార్లు మాత్రమే తెగుళ్లకు, పూతకు మందులను పిచికారి చేసే రైతులు రాను రానూ ఆరేడు మార్లు పిచికారి చేయవలసిన పరిస్థితులు వస్తున్నాయి. ఇంత చేసినా ఒక్క గాలి దుమారం చాలు రైతు కంట కన్నీరు పెట్టించడానికి. ఆరేడేండ్లుగా మామిడి రైతు ఏదో ఒకరూపాన నష్టం చవిచూస్తూనే ఉన్నాడు. ఇక మార్కెట్ సైతం ఆదిలో ఆశాజనకంగా ఉన్నా.. ధర తీరా రైతు అమ్ముకునే సమయానికి అధమ స్థాయికి పడిపోతుంది. గత రెండు సంవత్సరాలుగా వడగండ్ల వానలు మామిడి రైతుకు కడగండ్లను మిగిల్చాయి. కాని ప్రభుత్వం ఏనాడు ఆదుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఈ సంవత్సరం పూతలు ముందుగానే పలకరించి, విపరీతంగా వచ్చాయి. రైతులు ఆనందంతో పెట్టుబడులకు వెనుకంజ వేయలేదు. కానీ ప్రకృతికి రైతు ముఖంలో ఆనందం చూడడం ఇష్టం లేనట్లుంది. తన ప్రతాపం చూపుతూ వచ్చింది. పగటి వేళల్లో వుండవలసిన ఉష్ణోగ్రత లేకుండా పోయింది. ఉదయం 9 గంటలవరకూ ఆకాశం మేఘావృతమై ఉండడం, మంచు సైతం పడడంతో రైతు ఆశలు ఆవిరవుతూవచ్చాయి. ఫలితంగా తేనె మంచు పురుగు, నల్లి తోటలను అలుముకున్నాయి. చూస్తుండగానే కొండలా కనిపించిన పూత, పిండిలా రాలిపోయింది. ప్రస్తుతం తోటలన్ని మోడుబారి పోయి వానాకాలపు తోటలను తలపిస్తున్నాయి. ఈ దశలో కురిసిన వడగండ్ల వానలు రైతును కోలుకోలేని దెబ్బతీశాయి. ఆ నష్టాల నుండి బయట పడవచ్చని ఆశపడిన మామిడి రైతుకు ఈ మారు ఆదిలోనే కన్నీరు మిగిలింది. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో మామిడి రైతులకు సబ్సిడీ మీద, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందజేశారు. విపత్తుల సమయంలో తోటలను పరిశీలించి కొన్ని మార్లు నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకున్నారు. ఆ తరువాత ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహాన్ని ఇస్తామంటున్నా కాని మామిడి రైతును ఏరకంగా ఆదుకున్నది లేదు. ఈ మారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆశతో మామిడి రైతులున్నారు.

## డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు

**కూసుమంచి సిఐ సంజీవ్**




ప్రజాపక్షం/కూసుమంచి: డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని, కంటి చూపు బాగుంటేనే వాహనాన్ని సమర్ధవంతంగా నడపగలుగుతారని కూసుమంచి సిఐ సంజీవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ మూడోవ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో కూసుమంచి హైవేలో వెళ్తున్న భారీ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు శివ అప్టికల్స్ సహకారంతో కూసుమంచి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆటో, లారీ, ట్రాక్టర్, కారు డ్రైవర్లకు రోడ్డు భద్రతలో పాటించాల్సిన నియమాలపై సమగ్రంగా వివరించారు. ఈ శిబిరం ద్వారా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, క్రమం తప్పకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. చాలా మంది డ్రైవర్లు కంటి చూపును అశ్రద్ధ చేస్తున్నారనే ఉద్దేశంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కూసుమంచి ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

## చరిత్రను చెరిపేస్తున్న గుళ్లవనంలో గుప్తనిధి తవ్వకాలు





ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం నరసాపురం గ్రామ సమీపంలోని గుళ్లవనం ప్రాంతంలో గుప్తనిధి ఆశతో జరుగుతున్న అక్రమ తవ్వకాలు వేల సంవత్సరాల చారిత్రక దేవాలయాలపై ముప్పుగా మారుతున్నాయి. ఒకప్పుడు నూటొక్క దేవాలయాలతో వెలుగొందిన ఈ పవిత్ర ప్రాంతం నేడు నిర్లక్ష్యానికి గురై కాలగర్భంలో కలిసిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాచీన కాలంలో ఎక్కడా సున్నం, లక్క వంటి పదార్థాలు ఉపయోగించకుండా రాయి మీద రాయి పేర్చి అద్భుత శిల్పకళతో నిర్మించిన ఈ దేవాలయాలు ఆధ్యాత్మికతకు, కళా వైభవానికి ప్రతీకలుగా నిలిచాయి. అయితే ఇటీవల గుప్తనిధుల కోసం కొందరు అక్రమార్కులు గుళ్లవనంలో ఉన్న ఒక పురాతన దేవాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేసి గర్భగుడిలో సుమారు ఇరవై అడుగుల లోతువరకు తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో చారిత్రక వారసత్వం నాశనం అవుతుండటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేల ఏళ్ల చరిత్రను మోస్తున్న ఈ అపూర్వ శిల్ప సంపదను కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, గుప్తనిధి తవ్వకాల వెనుక ఉన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి గుళ్లవనం ప్రాంతాన్ని రక్షణలోకి తీసుకుని చారిత్రక దేవాలయాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్ తరాలకు అందాల్సిన గొప్ప వారసత్వం శాశ్వతంగా కనుమరుగైపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి కళ్యాణం





ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజపురం గ్రామంలో కొలువైఉన్నటువంటి ఊరు కాచే ముత్తయిదు పెద్దమ్మతల్లి జాతర గత వారం రోజుల నుండి ఆదివాసి నాయకుపోడు గిరిజన బిడ్డల పెద్దలు సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం ఉదయం 8గంటలకు పెద్దమ్మతల్లి కళ్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండా ప్రవేశం చేశారు. రెండు సంవత్సరాలకు ఒకసారి చేసే ఈ జాతరకు పలు మండలాల నుండి వందల సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి వారి మొక్కులు చెల్లించుకున్నారు. తదుపరి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి సుమారు 800 మందికి అన్నదానం చేశారు. ఆదివాసి పెద్దలు కన్నయ్య, అర్జయ్య పలువురు కళ్యాణం మహోత్సవం కన్నుల పండుగగా భక్తుల నడుమ ఎంతో ఉత్సాహంగా చేశారు. ఈ జాతరకు గ్రామంలో కుల, మతాలకు అతీతంగా జాతరలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో నాగరాజు, రాములు, రంగ, బాలు, నరసింహారావు, కమలయ్య, సీతయ్య, చిన్నముత్యం, రాజయ్య, నాగేశ్వరరావు, కన్నయ్య, నారాయణ, పకీరు, గోపాలకృష్ణ, గోపాల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

**-ఎన్టీఆర్‌కు నినాదాలతో ఘన నివాళి**



ప్రజాపక్షం/చంద్రుగొండ: తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చంద్రుగొండ సెంటర్‌లోని టీడీపీ దిమ్మె వద్ద పార్టీ జెండాను ఘనంగా ఎగరవేశారు. ఈకార్యక్రమంలో పార్టీ అభిమానులు, ఎన్టీ రామారావు అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, జైజై తెలుగు దేశం, జై ఎన్టీఆర్ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వారాధి సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల నాయకులు కోదుమూరి సత్యనారాయణ, నెక్కడపు శ్రీనివాసరావు, లాల్ మహమ్మద్, రాంబాబు, రమేష్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సర్పంచ్ మేదరి టోనీ

**-వృద్ధురాలి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన సర్పంచ్**



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి గ్రామానికి చెందిన వృద్ధురాలు హంస వాలి ఠాగూర్ మృతి చెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్(టోనీ)ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియలలో స్వయంగా పాల్గొని సర్పంచ్ టోనీ పాడె మోసి తన మానవతా భావాన్ని చాటుకున్నారు. అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హంస వాలి ఠాగూర్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ ప్రజలు ప్రార్థించారు.

## కరకగూడెంలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సిరిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో టిడిపి పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు చందా రాఘవులు, పాయల్ లక్ష్మీనారాయణ, పార్టీ కార్యాకర్తలు సిరిశెట్టి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో స్వర్గీయ ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల కోసం స్థాపించారన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన టిడిపి పటేల్, పట్వారి వ్యవస్థలను రద్దు చేయడంతో పాటు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రెండు రూపాయలకు కిలో బియ్యం, వృద్యాప్య పింఛన్, ఇండ్ల నిర్మాణం, జనతా వస్త్రాలు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడి స్క్రీన్ ద్వారా టిడిపి జాతీయ అధ్యక్షులు, ఏపి సిఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రసంగాలను తిలకించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా॥ వాసిరెడ్డి రామనాథంను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేతినేని హరీష్, వడ్డెం విజయ్, గుత్తా సీతయ్య, వాసు, మందడపు సుధాకర్, వెంకటనారాయణ, నల్లమల రంజిత్, నాగండ్ల లక్ష్మణ్, సున్నా నవీన్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రామారావు, రాజరాజేశ్వరి, సత్యావతి, ఝాన్సీ, పృథ్వీ పాల్గొన్నారు.

# నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నాల్గవ తరగతి ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. అనంతరం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా జి. బిక్కు, సహాయ అధ్యక్షులుగా ఆర్. ఓదేలు, ఉపాధ్యక్షులుగా ఎన్. మురళీమోహన్, జి. కృష్ణయ్య, బి. వీరమణి, ఎస్. సత్యప్రసాద్, కార్యదర్శిగా కె. వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా బుర్రి వెంకన్న, సిహెచ్ నారాయణరావు, ఎం. అరుణ, కోశాధికారిగా ఎం. అజ్మత్‌బేగ్, ఆఫీస్ కార్యదర్శులుగా అబ్దుల్ గఫూర్, కె. రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎస్‌కె హమీద్, సిహెచ్ నూరారెడ్డి, ప్రచార కార్యదర్శులుగా జి. నర్సింహారావు, డి. వీరేందర్, క్రీడా కార్యదర్శిగా బి. వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా కె. చంద్రశేఖర్, ఎస్‌కె రహీం, వి. ఝాన్సీ, అప్జా న్‌బీ, టి. శ్యామల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీరామ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ 2026 నుంచి 2029 వరకు మూడేళ్ల వరకు పదవిలో కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. నూతన కమిటీకి పలువురు ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# పోరాటాలతోనే హక్కుల సాధన

**-ఎన్ఎఫ్‌పిఈ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోరాటాలతోనే హక్కుల సాధన జరుగుతుందని ఎన్ఎఫ్‌పిఈ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మం తపాలా శాఖ ప్రధాన కార్యాలయం నందు ఎన్ఎఫ్‌పిఈ ఉమ్మడి ఖమ్మంజిల్లా ద్వైవ వార్షిక సంయుక్త సమావేశం ఏలూరి శ్రీనివాసరావు, వై. సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎన్ఎఫ్‌పిఈ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా పని భారాన్ని మోపుతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందని, ప్రశ్నించే గొంతుకలను సంకెళ్లతో బంధిస్తుందన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న ఉద్యోగులపై నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగులకు అనుకూలంగా ఉన్న ఉన్నత స్థాయి న్యాయస్థానం తీర్పులను అమలు చేయడం లేదన్నారు. హక్కులు సాధించాలంటే ఉద్యమాలు, పోరాటాలు అనివార్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహేందర్, మధుసూదన్‌రావు, ఎస్‌వి రావు, మాజీ నాయకులు రామశాస్త్రీ, నాగేశ్వరరావు, గ్రామీణ తపాలా రాష్ట్ర కార్యదర్శి జయరాజు, ఖాజామోహినుద్దీన్, మోలాలి, రాజ్యలక్ష్మి, సుబేదాబేగం, జిల్లా సూపరింటెండెంట్ వి. వీరభద్రస్వామి, పోస్ట్‌మాస్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పోస్ట్‌మెన్ సంఘం అధ్యక్షునిగా వై. సత్యనారాయణ, కార్యదర్శిగా పెరుగు నాగేశ్వరరావు, క్లాస్ 3 యూనియన్ అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బందెల నాగరాజు, కోశాధికారిగా రవీంధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అమెరికా ఆధిపత్యంపై పోరాడుదాం

**హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలంత ఏకమై పోరాటాలు చేయాలని హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో ఇరాన్‌పై(ఆమెరికాఇజ్రాయల్) చేస్తున్న యుద్ధానికి నిరసనగా సెమినార్‌ను నిర్వహించారు. తొలుత ఉద్యోగ, ఉపాధ్యాయ, కమిషనర్ వెల్ఫేర్ ఆవిర్భావ దినోత్సవం జెండాను సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమెరిక ఆదిపత్య దోరనితో అనేక దేశాలను కబలిస్తూ పెను ఉత్పాదాకంగా మారిందన్నారు. దౌర్జన్యంగా ఇతర దేశవనరులు దోచుకోవడంతో పాటు హామీలను నెరవేర్చలేక యుద్ధాలు చేస్తుందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో వేల మంది అమాయక ప్రజలు బలవ్వడంతో పాటు లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందన్నారు. ఐక్య రాజ్యసమితి ఉన్నప్పటికీ దాని ఆదేశాలను సైతం అగ్రరాజ్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే యుద్ధంపై భారత దేశం తటస్త విధానాన్ని అవలంభించడం సరైనది కాదన్నారు. ఇలాంటి విధానంతో రేపు మనకి అండగా నిలిచేవారెవ్వరు ఉండరన్నారు. ఉద్యోగులు సంక్షేమమే కాకుండా సామాజిక స్పృహ కలిగించే సెమినార్ ఏర్పాటు చేయడంపై సంఘాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, బానోత్ దివ్య, ప్రసాద్, కడవ నవీన్‌కుమార్,ఫుల్‌చంద్, బానోత్ భాస్కర్, వెంపటి ఉమా, ఉద్యోగ సంఘం నాయకులు విజయ్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శోభన్, రాములు, సాయిబాబ, దేవయ్య, శ్రీనివాస్, వెంకటరమణ, వీరన్న, రాణి, వెంకటేశ్వరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షంతో పశువైద్యాధికారి హరీష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎండాకాలంలో పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలని హరీష్ సూచించారు. ఈ మేరకు ప్రజాపక్షంతో ఆదివారం ఆయన ముచ్చటించారు...పశువుల కొట్టంపై వరిగడ్డి లేదా? తాటాకు కప్పి అప్పుడప్పుడు చల్లని నీటితో తడపాలన్నారు. అలాగే కొట్టాల చుట్టు గోడలు కట్టకుండా గాలి, వెలుతురు ప్రవేశించేలా చూసుకోవాలన్నారు. షెడ్లల్లో పశువులు తడిచేలా షెవర్స్, స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా షెడ్ల రెండువైపులా గొనేసంచులు, పరదాలు కట్టి వాటిని ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలన్నారు. పశువులను చల్లటి, ఎండ సమయంలో విడవకుండా ఉదయం 7నుంచి10గంటలలోపు సాయంత్రం 5 నుంచి7గంటల లోపు మేతకు వదలాలన్నారు. అవి దాహం తీర్చుకునేందుకు ఎల్లప్పుడు చల్లటి త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అందులో సరిపడ ఉప్పు, లవన మిశ్రమాలు మినరల్ మిక్చర్ కలపాలన్నారు. వీటితో పాటు వైద్యులను సంప్రదిస్తూ వ్యాధినిరోదక టీకాలు సకాలంలో వేయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పశువులను మనిషి లేకుండా విడిచిపెట్టవదని, లేని పక్షంలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మేత సమయంలో విషపూరిత పదార్థాలు తినే ప్రమాదం ఉందన్నారు. ఈ సమయంలోనే బావులలో పడటం, విద్యుత్‌షాక్ గురవ్వడం జరుగుతుందన్నారు. కావున రైతులు తగు చర్యలు తీసుకోని సురక్షితంగా జీవాలను ఉంచుకోవాలన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/పాల్వంచ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా ఆదేశాలతో పాల్వంచ శ్రీనివాసకాలనీలో వికేర్ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంధర్భంగా కుంటినాగుల గూడెం, శ్రీనివాస కాలనీకి చెందిన 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, డిసిసి ప్రసిడెంట్ దేవి ప్రసన్న, మునిపల్ కార్పొరేషన్ కమీషనర్ సుజాత, టిజి ఎస్‌పిఎఫ్ అడిషనల్ కమాండెంట్ పి. కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. చంద్రశేఖర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. కిరణ్, మైబూబ్ పీరా, ఎస్‌పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా సాగుదాం



**ప్రజాపక్షం/పాల్వంచ :** సమాజంలో అధిక శాతం గల బహుజనులు ఐక్యంగా కదిలి రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుదామని డాక్టర్ బిఆర్. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ వారసుల ఐక్యవేదిన వ్యవస్థాపక అధ్యక్షులు వానపాకుల రాంబాబు అన్నారు. స్థానిక ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ ప్రాంగణంలో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా రాంబాబు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం దక్కినపుడే ఆర్థికంగా బలోపేతం అవుతారని చెప్పారు. ఏప్రిల్ 10వ, తేదీన కొమరం భీమ్ హాల్‌లో బహుజనుల గళం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుతో పాటుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్‌లు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం చుక్కా రామ నర్సయ్య, పమ్మి రవిలచే ధూం, ధాం కార్యక్రమం ఉంటుందన్నారు. ముందుగా బహుజన గళం గోడ పత్రికలను ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మల్లేష్, ఉపాధ్యక్షులు సురేందర్, వంగలపూడి శ్రీను, మహిళా నాయకురాలు పుష్ప, వెంకటయ్య, చరణ్, భరత్‌చంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

# చెస్ క్రీడతో విద్యార్థుల్లో మేధోశక్తిని, ఏకాగ్రత పెంపు

- చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** చెస్ క్రీడ విద్యార్థుల్లో మేధోశక్తిని, ఏకాగ్రతను పెంచుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. పట్టణం 11వ డివిజన్ పరిధిలోని గీతాంజలి పబ్లిక్‌స్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన చెస్ పోటీ బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ఆదివారం ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారికి ఆయన షీల్డులు, మెమోంటోలు బహుకరించి అభినందనలు తెలిపారు. అనంతరం పాషా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ప్రధానంగా చెస్ వంటి క్రీడలు మెదడుకు పదును పెడతాయని, క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని వివరించారు. చదువుతో పాటు క్రీడలకువిద్యార్థుల మానసిక ఉల్లాసానికి, సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను ఇలాంటి క్రీడల్లో ప్రోత్సహిస్తున్న గీతాంజలి స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ పడాల ఆకాంక్ష, చైర్మన్ సుబ్బయ్య, డైరెక్టర్ ప్రవీణ్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్ చల్లా శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# నేడు సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి

- సేవ్ సింగరేణి నినాదంతో గుర్తింపు సంఘం ధర్నా
- తరలి రానున్న 11 ఏరియాల సింగరేణి నేతలు, కార్మికులు
- గుర్తింపు సంఘం నినాదాలతో దద్దరిల్లనున్న కొత్తగూడెం
- నేటితో ముగియనున్న ప్రచార జాత
- హాజరు కానున్న నారాయణ, కూనంనేని
- కార్మిక పోరాటాలకు మరో ముందడుగు

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి అనుబంధం) గుర్తింపు సంఘం నేడు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించనుంది. సేవ్ సింగరేణి పేరిట గుర్తుంపు సంఘం కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 18న మంచిర్యాల జిల్లా బెల్లంపెల్లి ఏరియాలోని గోలేటి నుండి జాత ప్రారంభం కాగా ఆ జాత నేడు కొత్తగూడెంలో ముగియ నుంది. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయ ముట్టిడితో పాటు భారీ ధర్నా నిర్వహించనున్నారు. ప్రదర్శనగా యూనియన్ కార్యాలయం నుండి బయలు దేరి బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా సింగరేణి ప్రధాన కార్యాలయానికి పెద్ద ఎత్తున కార్మికులు చేరుకుంటారు. ఈ కార్యక్రమానికి సింగరేణిలో 11 ఏరియాల నుండి కార్మికులు నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు.

**హాజరుకానున్న నారాయణ, కూనంనేని :**
గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సింగరేణి కార్యాలయ ముట్టడి, ధర్నా కార్యక్రమానికి సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా. కే నారాయణతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారు. వీరితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ గుర్తింపు యూనియ్ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు హాజరవుతారు.

**కార్మిక పోరాటాలకు మరో ముందడుగు :**
సింగరేణి సంస్థ మనుగడ సాగించాలంటే నూతన బొగ్గు బ్లాక్‌ల ప్రారంభం ఎంతో అవసరం. ఏడాది చివరిలో ఆదాయపన్ను భారం కార్మికులు భరిస్తున్నారు. ఆ భారాన్ని కోల్ ఇండియా తరహాలో సింగరేణి సంస్థ భరించాలనేది నాయకులు డిమాండ్. పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని గుర్తింపు సంఘం పట్టుబడుతోంది. కార్పొరేట్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ ఒప్పందాలను అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సొంతింటి పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని , మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల డిపెండెంట్లకు, వివిధ కారణాలతో ఆగిపోయిన కార్మికుల పిల్లలకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నేతలు కోరుతున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని డిమండ్ చేస్తూ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు నేడు భారీ ముట్టడి, ధర్నా కార్యక్రమాన్ని గుర్తింపు సంఘం తలపెట్టింది. ఈ కార్యక్రమం కార్మిక పోరాటలకు మరో ముందడుగుగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి
- బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కును దళిత క్రైస్తవులకు వర్తింపజేయడంలో జరుగుతున్న చారిత్రక అన్యాయంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం మతం మారినంత మాత్రాన దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం తొలగిపోవని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా కేవలం హిందూ దళితులకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేశారని, ఆ తర్వాత 1956లో సిక్కులకు, 1990లో బౌద్ధులకు ఈ హోదాను వర్తింపజేశారని గుర్తు చేశారు. క్రైస్తవ దళితులను విస్మరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (వివక్ష రహితం)లను ఉల్లంఘించడమేనని బాబురావు విమర్శించారు. ఆర్టికల్ 25 ప్రకారం ఒక వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కు ఉన్నప్పుడు, అతనికి అందాల్సిన సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీఓ ఎంఎస్ నం: 341 ద్వారా దళిత క్రైస్తవులను బిసిసి వర్గంగా గుర్తించారని, అయితే వారికి అందుతున్న 1 శాతం రిజర్వేషన్ ఏమాత్రం సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికలో దేశ వ్యాప్తంగా దళిత క్రైస్తవుల పరిస్థితి ఇతర ఎస్సీల కంటే హీనంగా ఉందని తేలిందని, మతంతో సంబంధం లేకుండా వారికి ఎస్సీ హోదా ఇవ్వాలని సిఫార్సు చేశారని గుర్తు చేశారు. ఇటీవల (ఫిబ్రవరి 13, 2026) అలహాబాద్ హైకోర్టు కూడా మతం మారినప్పటికీ పుట్టుకతో వచ్చే కులం మారదు అని తీర్పునిచ్చిందని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్ర రాష్ట్ర కార్టూన్‌ల పోటీ

ప్రశంశలు పొందిన పాల్వంచ కార్టూన్



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాలో నరసరావుపేటకు చెందిన నేస్తం సంఘం ఆధ్వర్యంలో ఎస్. ఎస్. ఎస్. కళాశాలలో ఆదివారం కార్టూన్‌ల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న పాల్వంచకు చెందిన కార్టూనిస్ట్ సుభానీకి ప్రశంశలు దక్కాయి. తెలంగాణ, ఆంధ్ర, కోస్టల్ ఆంధ్రాలకు చెందిన కార్టూనిస్టులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు 300 కార్టూన్ల నుండి 80 కార్టూన్‌లను ఎంపిక చేసి ప్రదర్శించారు. దీనిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి పాల్వంచకు చెందిన సుభానీ గీసిన కార్టూన్‌కు చోటు లభించినది. మనుషుల బలహీనతలపై కార్టూన్ గీసిన సుభానిని ప్రముఖ హాస్య నటుడు గుండు సుదర్శన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా కార్టూనిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జకీర్, వేముల రాజమౌళి, ప్రముఖ కార్టూనిస్ట్‌లు సరసి, శేఖర్, నాగిశెట్టి, ప్రసాద్, కాజా, మహిళా కార్టూనిస్ట్ పద్మ, అరుణ్, ప్రసిద్ద తదితరులు పాల్గొన్నారు.

# జూలూరుపాడులో ఘనంగా మట్టల ఆదివారం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జులురుపాడు మండల కేంద్రంలోని, న్యూ కాలనీ, సిఎస్ఐ చర్చి పరిధిలో క్రైస్తవులు ఆదివారం ఈత మట్టలు చేత బూని క్రైస్తవ గీతాలతో జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ కొప్పుల లోకేశ్వరరావు భక్తులకు మట్టల ఆదివారం విశిష్టత గురించి తెలిపారు. ఈత ఆకులను విజయం, శాంతి, నిత్యజీవం కు సంకేతంగా భావిస్తారని, యేసు రాజుగా కాకుండా ఆధ్యాత్మిక రక్షకుడుగా క్రైస్తవులు స్వీకరించిన రోజునే మట్టల ఆదివారం అంటారని, తమ పాపాలను ప్రక్షాళన చేసి రక్షించడానికి ఏసు ఆ ప్రాంతానికి వచ్చి చనిపోయి మళ్లీ తిరిగి లేచారనేది గుర్తు చేసుకుంటూ మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించుకుంటారని ఫాదర్ భక్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోహాను, సుందర్ రావు, సుకన్య, కిరణ్, ప్రభాకర్, తిరుపతి, శాంతకుమారి, కరుణమ్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంతో మహిళ మృతి

- వరిపొట్టు మీద పడి ఊపిరాడక మహిళ కూలీ మృతి
- మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారాకో



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిబంధనలు పాటించకపోవటంతో రైస్ మిల్లు లో ఓ నిండు ప్రాణం పోయింది. యాజమాన్యం నిర్లక్ష్యం వలన జరిగిన ప్రమాదంలో మహిళ కూలీ మృతి చెందింది. యాజమాన్యం స్పందించకపోవటంతో బంధువులు రాస్తాకారో నిర్వహించారు. మిల్లు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం వద్ద ఉన్న అరుణాచల రైస్ మిల్ లో ఆదివారం మహిళ కూలీ మృతి చెందింది. కూసుమంచి మండలం లోని జక్కేపల్లి గ్రామానికి చెందిన పప్పుల కళ్యాణి (34) అనే మహిళ రైస్ మిల్లు లో రోజు వారీ కూలీ పనులకు వెళ్తుంది. ఆదివారం మిల్లులో వరి పొట్టు తీసేందుకు పనులు చేస్తుండుగా పొట్టు మొత్తంఒక్కసారిగా ఆమె పై పడింది. అక్కడే ఉన్న సహచర కూలీలు కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ఊపిరాడక అపస్మారక స్థితికి చేరింది. కొంత మంది ఆమే కు సీఆర్పీ చేసి, నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యం కోసం తీసుకొచ్చారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి పై మిల్లు యాజమాన్యం స్పందించకపోవటంతో అగ్రహించిన బంధువులు, కుటుంబ సభ్యులు నేలకొండపల్లి ప్రధాన సెంటర్ లో రాస్తారాకో నిర్వహించారు. మిల్లు యాజమాన్యం పై తగిన చర్యలు తీసుకోవాలని, మృతురాలికుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఖమ్మంకోదాడ ప్రధాన రహదారి పై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని ఆందోళనకారుతో చర్చించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వరపురం లోని రైస్ మిల్లు లో గతంలో కూడ ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తుంది. రైస్ మిల్లు యాజమాన్యం నిబంధనలు పాటించటం లేదని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.